
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
ఆదివారం 31 మార్చి 2024



యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

రేపటి నుంచే కేంద్రాలు షురూ


ధాన్యం తూకం (ఫైల్)

- సంగారెడ్డి జిల్లాలో 192, మెదక్ జిల్లాలో 399 కేంద్రాల ఏర్పాటు
- ఏ గ్రేడ్ క్వింటాలుకు మద్దతు ధర రూ.2,203
- సాధారణ రకానికి రూ.2185
- రూ.500 బోనస్ లేనట్టే!

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్, మార్చి 30 : సంగారెడ్డి, మెదక్ జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం సిద్ధమైంది. ఏప్రిల్ 1 నుంచే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది. వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు చెల్లించిన ధరనే యాసంగికి ఇవ్వనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ లెక్కన గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,185 మద్దతు ధర చెల్లించనున్నది. ఇక ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్‌గా ఇస్తామన్న హామీ ఈ యాసంగి ధాన్యం కొనుగోలుకు అమలు చేయకపోవడంతో రైతులు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మెదక్‌లో దశల వారీగా..

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 192 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ 103 కేంద్రాలను, పీఏసీఎస్‌లు 76 కేంద్రాలను, డీసీఎంఎస్ 12 కేంద్రాలను ప్రారంభించనున్నది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి క్రమేణ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది. మెదక్ జిల్లాలో 399 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నది. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 103, ఎఫ్‌పీవో 10, పీఏసీఎస్ 274, డీసీఎంఎస్ ద్వారా 12 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మెదక్ జిల్లాలో ఏప్రిల్ 5 నుంచి కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. మెదక్, హవేళీఘణపూర్, పాపన్నపేటలో తొలుత కేంద్రాలను ప్రారంభిస్తారు. ఏప్రిల్ 15లోపు మిగతా కేంద్రాలను దశల వారీగా ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

దిగుబడి అంచనా

ఈ యాసంగిలో సంగారెడ్డి జిల్లాలో లక్షా 9 వేల ఎకరాల్లో వరిని సాగు చేశారు. దిగుబడి అయ్యే ధాన్యంలో కొంత మేర విత్తనాల కోసం నిల్వఉంచుకోనుండగా, 1.88 లక్షల టన్నుల ధాన్యం కేంద్రాలకు తెచ్చే వీలున్నదని యంత్రాంగం అంచనా వేశారు. ఈ ధాన్యం ఏప్రిల్, మే, జూన్ నెలలో వస్తుందని అంచనా వేశారు. ఏప్రిల్‌లో 17 వేల టన్నులు, మే నెలలో 1.46 లక్షల టన్నులు, జూన్‌లో 25 వేల టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని యంత్రాంగం పేర్కొన్నది. మెదక్ జిల్లాలో 2,58,465 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా 3,60,375 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అందుకు తగినట్లుగా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుబాటులో గోనె సంచులు

కేంద్రాలకు ధాన్యం తెచ్చేందుకు ఇక్కడి నుంచి మిల్లర్లకు తరలించేందుకు అవసరమైన గోనె సంచులను యంత్రాంగం అందుబాటులో ఉంచింది. సంగారెడ్డి జిల్లాలో కేంద్రాలకు రానున్న ధాన్యంకు సంబంధించి 25,47,315 గోనె సంచులు అవసరమవుతాయి. అయితే, కొత్తగా 21,27,548 గోనె సంచులు జిల్లా యంత్రాంగం వద్దే అందుబాటులో ఉన్నాయి. అంచనాను బట్టి 4 లక్షల గోనెసంచులు కావాల్సి ఉన్నది. అయితే వినియోగించిన గోనె సంచులు 20,15,555 మళ్లీ అందుబాటులో ఉంచనున్నట్లు పౌరసరఫరాల సంస్థ తెలిపింది. అందువల్ల జిల్లాలో గోనెసంచులను ఇబ్బందులు ఏమీ ఉండదని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో దాదాపు 90 లక్షల గోనె సంచులు అవసరం ఉండగా 60 లక్షల సంచులను అందుబాటులో ఉంచారు. మరో 30 లక్షల సంచులు అవసరం పడతాయి. కొనుగోళ్ల ప్రారంభం కాగానే వాటిని అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు పేర్కొన్నారు.

రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే!



తాము అధికారంలోకి రాగానే రైతులకు వరి ధాన్యంపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ఓట్ల కోసం రైతులను మభ్యపెట్టడం సరికాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలల గడుస్తున్నప్పటికీ బోనస్ ఇవ్వకపోతే రైతులను మోసగించడమే అవుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతులకు రూ.500 బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలవాలి.

- రాఘవేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

తూకం యంత్రాలు, ఇతర పరికరాలు రెడీ

ఇక ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొనుగోలు కేంద్రాల వద్ద ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలను పౌరసరఫరాల సంస్థ సిద్ధం చేసింది. కేంద్రాలకు ధాన్యం వచ్చిన తర్వాత వర్షం గాలిదుమారం వస్తే ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచనున్నారు. సంగారెడ్డి జిల్లాలో ధాన్యంపై కప్పడానికి 6,720 టార్పాలిన్‌లు అవసరం ఉండగా, 6,350 అందుబాటులో ఉంచారు. ఇంకా అవసరమైన 370 టార్పాలిన్ షీట్లను తెప్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ధాన్యాన్ని శుభ్రపరిచే పాడీక్లీనర్ యంత్రాలను ప్రతీ కేంద్రంలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 225 ప్యాడీక్లీనర్లను ఏర్పాటు చేశారు. అలాగే తేమ శాతంను గుర్తించేందుకు అవసరమైన 250 యంత్రాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.


మెదక్‌లో తూర్పార పడుతున్న ధాన్యం

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి


పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 30 : లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని పలు పార్టీల ప్రతినిధులను ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి కోరారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నిల కమిషన్ ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేసిందని, ఏప్రిల్ 18న నోటిఫికేషన్, 25న నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్ నిర్వహించినున్నట్లు తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ జరుగుతుదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులకు సువిధ యాప్ ద్వారా ప్రచార అనుమతులు అందిస్తామన్నారు. విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం, తప్పుడు ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాలు జరిగితే నంబర్ 1950, సి.విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఆంటోని, పార్టీల నాయకులు బాషా, కృష్ణ, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ప్రచార సామగ్రి ముద్రణ

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 29: నిబంధనల మేరకు పార్లమెంట్ ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణను చేపట్టాలని ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరపత్రాలు, పోస్టర్లు ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణకర్త పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్లు స్పష్టంగా సూచించాలన్నారు. మూడు అదనపు ప్రింట్‌లను ప్రచురణ కర్తతో పొందిన డిక్లరేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయానికి ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127(ఏ) ప్రకారం పంపించాలని ఆదేశించారు. ధర సమాచారాన్ని మూడు రోజుల్లో అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం లైసెన్స్‌ను రద్దు చేయడంతోపాటు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

రాజకీయ ప్రకటనల కోసం తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ జీ1లో ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందించాలన్నారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, ప్రకటనలు ప్రసారం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సి.విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. అలాగే డయల్ 1950 టోల్‌ఫ్రీ ద్వారా కూడా సమాచారం అందించొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే వాహనం తనిఖీ

మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎమ్మెల్యే పోలీసుల తనిఖీలకు సహకరించారు.

- చేగుంట, మార్చి 30



నీటిని విడుదల చేసి పంటలను కాపాడండి

- శాలిపేట గ్రామస్థులను కోరిన చెన్నాయిపల్లి రైతులు
- నీళ్లు ఇవ్వబోమని భీష్మించుకూర్చున్న శాలిపేటవాసులు
- పంటకు నిప్పు పెట్టడమే దిక్కని చెన్నాయిపల్లి రైతుల ఆవేదన
- నల్లచెరువు నుంచి నీటి విడుదలకు అధికారుల హామీ

7లో

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

- చివరి రోజు విద్యార్థుల కేరింతలు


సంగారెడ్డిలో సంతోషంతో బాలికలు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 30 : చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్న వారు ఈ రోజుతో హాస్టల్‌లకు టాటా చెప్పారు. స్నేహితులకు బైబై చెబుతూ వారితో ఊసులు పంచుకున్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న పరీక్షలు ప్రారంభం కాగా, చివరి రోజైన శనివారం సాంఘీక శాస్త్రం పరీక్ష జరిగింది. సంగారెడ్డి జిల్లాలో 22,050 మందికి 22,009 మంది హాజరుకాగా, 41 మంది గైర్హాజరయ్యారు. 99.81 శాతం హాజరు నమోదైంది. కొండాపూర్ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేయగా, 30 కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ పరిశీలించారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 10,334 మంది విద్యార్థులకు 10,308 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. చివరి రోజు పరీక్ష అనంతరం విద్యార్థులు ఉత్సాహం, ఆనందంతో కేంద్రాల వెలుపలకు రావడం కనిపించింది. కేరింతలు కొడుతూ పరీక్షా ప్యాడ్లను పైకి ఎత్తి సంతోషంతో ఇంటి బాట పట్టారు. కొందరు కరచాలనం, కౌగిలించుకుంటూ సెల్ఫీలు దిగారు. కాగా రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు సామగ్రి తీసుకొని సొంతూళ్లకు పయనమయ్యారు.


సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ కేంద్రం వద్ద టాటా చెప్పుకుంటున్న విద్యార్థినులు




సంగారెడ్డిలో కేరింతలు కొడుతున్న విద్యార్థులు, చేగుంటలో పరీక్ష కేంద్రం నుంచి సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థులు


మెదక్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'

మెదక్ కల్చరల్/సంగారెడ్డి అర్బన్, మార్చి 30 : మెదక్, సంగారెడ్డి పట్టణాల్లో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ప్రధాన ద్వారం నుంచి వందలాది ద్విచక్రవాహనాలతో మొదలై పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. చర్చి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశం అందించారు. శాంతి, స్నేహభావంతో కూడిన జీవనం కోసం జీసస్ చూపించి, ఆచరించిన మార్గాన్ని అనుసరించాలని బోధించారు. శాంతి కోసమే జీసస్ ఫర్ రన్ నిర్వహించామని తెలిపారు. యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరమ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో కొనసాగిన రన్ పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పోతిరెడ్డిపల్లి మీదుగా సీఎస్ఐ చర్చి వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్(యూసీఎఫ్), యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరమ్‌ల(యూసీవైఎఫ్)అధ్యక్షులు రూబిన్‌రెడి, ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫాదర్ ఇన్నారెడ్డి భక్తులకు దైవ సందేశం అందించారు.


సంగారెడ్డి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కంటైనర్ ఢీకొని ఒకరి దుర్మరణం

7

కారు బోల్తాపడి యువకుడి మృతి

- ఒకరికి గాయాలు

మెదక్ జిల్లాలో 30 యాక్ట్ అమలు

- ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మార్చి30 : మెదక్ జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 30 వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ డాక్టర్ బాలస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చు

● సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, మార్చి 30: విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చు అని, చదువుతో పాటు ఆటపాటలలో ముందుండాలని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో కాకతీయ హైస్కూల్ వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వైపు విద్యార్థులు మొగ్గు చూపకుండా చదువుపై ఆసక్తిని కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్రీడలతో విద్యార్థులకు మానసిక, శారీరక ధృడత్వం లభిస్తుందని అన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాన్ని చూసి అభినందించారు. వారికి బహుమతులను అందజేశారు. ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్‌ను కరస్పాండెంట్ జెగ్గు మల్లారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో బ్యాగ్ లెస్ డే

వర్గల్, మార్చి 30: సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బ్యాగ్‌లెస్ డే కార్యక్రమాలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం విద్యాలయంలో విద్యార్థులు క్యాంపస్ శుభ్రత కార్యాక్రమాన్ని నిర్వహించారు. విద్యాలయ ప్రాంగణంలో ఉన్న చెత్తను, గార్డెన్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. హైదరాబాద్‌కు చెందిన సూక్ష్మ కళాకృతం కాళాకారుడు సూరం సంపత్‌కుమార్ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్ట్‌కు సంబంధించిన విషయాలను తెలిజేశారు. 800 చాక్‌పీస్‌లో నిర్మింపజేసిన యాదాద్రి ఆలయం నమూనాను చూపించారు. చాక్‌పీస్‌లతో ఆంగ్ల అక్షరాలు ఎలా తయారు చేయాలో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్‌తో పాటు అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)



మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

బీఆర్ఎస్ మునిగిపోయే నావ

● మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నర్సాపూర్/శివ్వంపేట/కొల్చారం, మార్చి 30: బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్, మోసం చేయడంలో హరీశ్‌రావు దిట్ట అని మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శించారు. శనివారం నర్సాపూర్, శివ్వంపేట మండలం చండి, కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి, హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశాల్లో రఘునందన్‌రావు మాట్లాడారు. కేసీఆర్ ఇలాకా అయిన మెదక్ నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచే స్థానిక ఉద్యమ నాయకులు పనికిరారా అని ప్రశ్నించారు. డబ్బులున్నాయన్న ఉద్దేశంతో ఇతర ప్రాంతానికి చెందిన మాజీ అధికారిని బరిలో దించారని ఆరోపించారు. ఉద్యమ నాయకులకు బీఆర్ఎస్ తీవ్ర అన్యాయం చేసి, ఉద్యమ ద్రోహులను అందలం ఎక్కించడం వల్లనే ఆ పార్టీకి గడ్డు పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులకు కరువై మూడు పార్టీలు మారిన వ్యక్తికి టికెట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎత్తిన కాషాయజెండాను దించకుండా పార్టీని నడపాల్సింది బూత్ కమిటీ అధ్యక్షులేనన్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉండే తనకు మెదక్ ఎంపీగా అవకాశమిస్తే మెదక్ పార్లమెంటును అన్ని విధాల అభివృద్ధి చేయడమే కాకుండా దేశంలోనే ఈ ప్రాంతానికి ప్రత్యేక పేరు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి ఇప్పుడు కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మట్టి, ఇసుక దందా కోసమే కాంగ్రెస్ పార్టీలోకి పోతున్నడని ఆరోపించారు. సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, మాజీ ఎంపీపీ రమణారావు, కౌన్సిలర్లు సురేష్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు కొత్తశ్రీనివాస్, నాగరాజు, నగేష్, శంకర్, చంద్రయ్య, ఉమాశ్రీ, కవిత, కౌడిపల్లి మండలాధ్యక్షుడు రవి, మండల నాయకులు రాజేందర్, రమణారావు, సామల యాదగిరి, వాల్దాస్ మల్లేష్‌గౌడ్, అంజనేయిలు గౌడ్, మాణయ్య యాదవ్, దుర్గయ్య హరీష్, కొల్చారం, కౌడిపల్లి మండలాల అధ్యక్షులు దయాకర్‌గౌడ్, ఖాజీపేట రాకేష్ పాల్గొన్నారు.



పోతంశెట్‌పల్లిలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

● బీబీపాటిల్‌కు నీతి, నిజాయితీ, నిబద్ధత లేవు

● శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఆరు వారంటీలుగా మిగిలిపోయాయని శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శనివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి రాష్ట్రంలో 12ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపుకోసం పని చేయాలన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్‌కు నీతి, నిజాయితీ, నిబద్ధత లేకుండా వ్యవహరించారని, ఆయనకు దిమ్మతిరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జహీరాబాద్ ఎంపీలుగా పదేళ్లు బీబీపాటిల్, ఐదేళ్లు సురేష్‌షెట్కార్ ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తే ఈడీ బేడీలతో రాజకీయం చేస్తూ కేజ్రీవాల్, కవితలను అరెస్టు చేయించారని పోచారం విమర్శించారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ తన ఆస్తులను కాపాడుకోవడానికే బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి బీజేపీలో చేరారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సాయికుమార్, వేణుగోపాల్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రాములు, మోయిద్ ఖాన్, మండలాధ్యక్షులు పరమేశ్వర్, శ్రేయారెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్యపాల్ రెడ్డి, గీతారెడ్డి, జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్ పాల్గొన్నారు.



ఖేడ్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నీటిని విడుదల చేసి పంటలను కాపాడండి

● శాలిపేట గ్రామస్థులను కోరిన చెన్నాయిపల్లి రైతులు

● నీళ్లు ఇవ్వబోమని భీష్మించుకున్న శాలిపేటవాసులు

● నల్లచెరువు నుంచి నీటి విడుదలకు కృషి చేస్తామని అధికారుల హామీ

చిన్నశంకరంపేట, మార్చి 30: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటలు కోత దశకు చేరగా.. ప్రస్తుతం నీళ్లందక ఎండిపోతున్నాయి. బోరు బావుల్లో నీరు అడుగంటిపోవడంతో పంట పొలాలకు నీళ్లు అందడం లేదు. చెన్నాయిపల్లి రైతులు శాలిపేట గ్రామస్థులను నల్లచెరువు నుంచి నీటిని విడుదల చేసేందుకు సహకరించాలని కోరితే నిరాకరిస్తున్నారు. దీంతో రైతుల గోస పట్టించుకొని శాలిపేట నల్లచెరువు నుంచి విడుదల చేయాలని చెన్నాయిపల్లి రైతులు అధికారులకు విన్నవించారు. స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పంటలకు నీరు అందించేందుకు స్థానిక అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. అనంతరం చెన్నాయిపల్లి గ్రామాన్ని సందర్శించిన ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ మన్నన్, ఎస్ఐ నారాయణగౌడ్, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఆర్ఐ గోవింద్ ఎండిన వరి పంటలను పరిశీలించారు. చేతికందే పంటలు ఎండిపోతున్నాయని చలించిన అధికారులు శాలిపేట నల్లచెరువును సందర్శించారు. ఆ గ్రామస్థులను పిలిపించి చెన్నాయిపల్లికి తూము నుంచి నీటిని విడుదల చేయాలని సూచించడంతో శాలిపేటవాసులు నీళ్లను వదిలేది లేదని భీష్మించుక్కూర్చున్నారు. అధికారులు నచ్చజెప్పినా వినలేదు. నల్లచెరువు 30 సంవత్సరాల నుంచి నిండలేదని అప్పుడు చెన్నాయిపల్లి గ్రామస్థులు శాలిపేటకు సహరించలేదన్నారు. ఈసారి చెరువు నిండడంతో చెన్నాయిపల్లి గ్రామస్థులు కుంటిసాకులతో వస్తున్నారని మండిపడ్డారు. ఏదేమైనా నీళ్లను వదిలే ప్రసక్తిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీలేక అధికారులు అక్కడి నుంచి చెన్నాయిపల్లికి చేరుకున్నారు. అక్కడి రైతులు నీళ్లను వదిలే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని లేకుంటే పంటలకు నిప్పు పెడుతామని ఆవేదన వ్యక్తం చేస్తూ వాహనాలను అడ్డుకునే యత్నం చేశారు. దీంతో అధికారులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. నీటి విడుదలకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.



శాలిపేట నల్లచెరువు వద్ద ఇరు గ్రామస్థులను సమన్వయపరుస్తున్న అధికారులు

రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోండి

● ఎలక్షన్ కమిషన్‌కు సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్ ఫిర్యాదు

సంగారెడ్డి రూరల్, మార్చి 30: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిలను పరుష పదజాలంతో రఘునందన్‌రావు దూషించారని ఆరోపించారు. ఈ మేరకు రఘుందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.80వేల నగదు పట్టివేత

జగదేవ్‌పూర్, మార్చి 30: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం పోలీసులు రూ.80 వేల నగదును పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. జగదేవ్‌పూర్‌లో వేసిన తాడిపత్రిలకు సంబంధించిన డబ్బు వసూలుకు హైదరాబాద్‌కు చెందిన అమర్‌రామ్ భువనగిరి నుంచి వ్యాన్‌లో వెళ్తున్నాడు. వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.80 వేల నగదు లభించడంతో పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ.. సీజ్ చేసిన డబ్బులను కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, బాధితులు అక్కడికి వెళ్లి అధికారులకు సరైన పత్రాలను చూపించి డబ్బు తీసుకెళ్లొచ్చని చెప్పారు.

కంటైనర్ ఢీకొని ఒకరి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కంటైనర్



రాములు (ఫైల్)

పుల్‌కల్, మార్చి 30: కంటైనర్ ఢీకొని ఒకరి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. పుల్‌కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామానికి చెందిన మిరియాల రాములు(65) వరి పొలానికి నీళ్లు పారబెట్టేందుకని చక్రియాల వైపు వెళ్తూ రోడ్డు దాటుతుండగా.. సంగారెడ్డి వైపు నుంచి జోగిపేట వైపునకు వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా రాములును రక్షించేందుకు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కంటైనర్ రహదారికి పక్కన అమర్చిన మెటల్‌బీమ్ బారియర్‌ను బలంగా ఢీకొట్టి సర్వీసు రోడ్డువైపు దూసుకెళ్లింది. దీంతో మెటల్‌బీమ్ బారియర్ సైతం ధ్వంసమయింది. కంటైనర్ డ్రైవర్, క్లీనర్ అక్కడి నుంచి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రహదారిపై నిలిచిపోయిన కంటైనర్‌ను పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ రెస్క్యూ సిబ్బంది పక్కకు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. కాగా, ఎన్నికల ప్రచార నిమిత్తం అటుగా వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కారు బోల్తాపడి యువకుడు..



సుల్తాన్‌పూర్‌లో బోల్తాపడిన కారు, ప్రమాదంలో గాయపడిన మెరాజ్

పుల్‌కల్, మార్చి 30: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై శనివారం కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షారూఖ్ మాలిక్(30), ఢిల్లీకి చెందిన మెరాజ్(43) స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రాంతంలోని చింతల్‌మెట్‌లో నివాసముంటూ దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. వ్యాపార నిమిత్తం హైదరాబాద్ నుంచి కారులో జోగిపేట వైపు వెళ్తున్నారు. సుల్తాన్‌పూర్ గ్రామ సమీపంలోకి వెళ్లగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో షారూఖ్ మాలిక్ అక్కడికక్కడే మృతి చెందగా, మెరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంకితభావంతో సేవలతోనే గుర్తింపు: ఎస్పీ



ఎస్ఐ సుభాష్‌ను సన్మానిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, మార్చి 30: అంకితభావంతో చేసిన సేవలే ప్రతీ ఉద్యోగికి మంచి గుర్తింపునిస్తాయని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. 41 సంవత్సరాలుగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించి శనివారం పదవీ విరమణ చేసిన ఎస్ఐ సుభాష్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వారి ద్దరూ పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళ్యాణి, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శ్రమిస్తేనే విజయం

పోటీతత్వంతో నిండిన నేటి సమాజంలో కఠినంగా శ్రమిస్తేనే విజయాలను అందుకోగలమని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చదువుతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగం సాధించగలమన్న నమ్మకంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎస్.భాస్కర్, ఎస్ఐ క్రాంతి కుమార్, గ్రంథాలయం ఇన్‌చార్జ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● తూప్రాన్ మున్సిపాలిటీ, చేగుంట అధికారులను ఆదేశించిన మెదక్ అదనపు కలెక్టర్ రమేష్



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్, పాల్గొన్న అధికారులు

తూప్రాన్, మార్చి 30: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ అధికారులను ఆదేశించారు. శనివారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు, వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిపై ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపల్, గ్రామాల పరిధిలో బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్లు లీకేజీ మరమ్మతులు, నూతన పైపులైన్ల నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రైవేటు బోర్లు, బావులు ఇతర నీటి వనరుల వివరాలు సేకరించి నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితులలో వాటి ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో బోర్లు, చేతి పంపుల మరమ్మతులను ఏప్రిల్ 4 వరకు పూర్తి చేసి నివేదికలు అందజేయాలన్నారు. సమీక్షలో తూప్రాన్ డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజామోహిజుద్దీన్, గ్రిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చేగుంట, మార్చి 30: వేసవి కాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం చేగుంట, నార్సింగి మండలాల పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, గ్రామాల్లో సమీపంలోని వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకొని మంచినీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసిల్దార్ గియాఉన్నిసా బేగం, గ్రిడ్ ఏఈ, శ్రీధర్, మిషన్ భగీరథ ఏఈలు వెంకటేష్, స్వప్న, ఎంపీవోలు నరేష్, హనుమంతరావు, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి బలవన్మరణం

మెదక్ అర్బన్, మార్చి 30: మెదక్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం చోటు చేసుకున్న ఘటనల్లో ఇద్దరు బలవన్మరణం చెందారు. మెదక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని స్థానిక దుర్గాకాలనీకి చెందిన తాపీమేస్త్రీ భీమవరపు ప్రసాద్(41) కొత్త ఇంటి నిర్మాణం కోసం నాలుగేళ్ల క్రితం అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక నిత్యం బాధపడేవాడని కుటుంబీకులు తెలిపారు. శనివారం ఉదయం గుడి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆటోనగర్‌లోని తన ఆఫీసులో శాలువాతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.



ఇస్మాయిల్ (ఫైల్)

● **చిలప్‌చెడ్:** మండలంలోని బండాపోతుగల్ గ్రామంలో శనివారం ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండాపోతుగల్ గ్రామాని చెందిన సయ్యద్ ఇస్మాయిల్ (38)మద్యానికి బానిసయ్యాడు. పని లేకుండా ఖాళీగా తిరుగుతున్నావని భార్య సయ్యద్ నాజియా మందలించడంతో 29వ తేదీన ఆమెతో గొడవపడ్డాడు. ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. ఉదయం 11 గంటల సమయంలో పల్లె ప్రకృతి వనం పక్కన గల చెట్టు కింద అపస్మారకస్థితిలో ఇస్మాయిల్ పడిఉన్నట్టు కుటుంబీకులకు స్థానికుల ద్వారా సమాచారమందడంతో ఘటనాస్థలానికి వెళ్లగా అతడి పక్కన విషం డబ్బా కనిపించింది. గ్రామస్థుల సహాయంతో కుటుంబీకులు జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, పరిస్థితి విషమించడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇస్మాయిల్ శనివారం తెల్లవారు జామున 4.40 గంటలకు మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య నాజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. ఒకరి మృతి

చిన్నశంకరంపేట, మార్చి 30: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన శామర్తి సామేల్ (44) వారం రోజుల క్రితం మెదక్ నుంచి బైక్‌పై రాత్రి ఇంటికి వస్తున్న క్రమంలో మెదక్ చేగుంట రహదారి ఏడిపల్ల్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర పంటగా గంజాయి సాగు



ప్యారారం గ్రామ శివారులో గంజాయి మొక్కలను తొలగిస్తున్న అధికారులు

రేగోడు మార్చి 30: మండలంలోని ప్యారారం శివారులో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ప్యారారం గ్రామ శివారులో జొన్న పంటలో సాగు చేసిన 12గంజాయి మొక్కలను పట్టుకొని తొలగించారు. పట్టుకున్న గంజాయి మొక్కల విలువ రూ. లక్షా 20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఆ భూమి తండాకు చెందిన రమనీబాయికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

కులం పేరుతో దూషించిన కేసులో డీఎస్పీ విచారణ

నిజాంపేట, మార్చి 30: మండల కేంద్రంలో నాలుగు రోజుల క్రితం రోడ్డు విషయమై జరిగిన గొడవలో తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కులం పేరుతో దూషించి వ్యక్తిపై దాడి చేయడంతో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగి భర్తపై వైద్యుడి దాడి ఘటనపై విచారణ

నారాయణఖేడ్, మార్చి 30: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో రోగి భర్తపై వైద్యుడు దాడి చేసిన సంఘటనపై శనివారం జిల్లా ఆస్పత్రుల కో ఆర్డినేటర్ సంగారెడ్డి విచారణ జరిపారు. మనూరు మండలం శెల్గిర గ్రామానికి చెందిన ప్రసాద్ భార్య అస్వస్థతకు గురి కావడంతో నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి శుక్రవారం సాయంత్రం తీసుకెళ్లారు. వైద్యుడు రాజ్‌కుమార్ తాము చెప్పిన డయాగ్నోస్టిక్ సెంటర్‌లో మాత్రమే పరీక్షలు చేయించుకొని రావాలని సూచించాడు. తమకు నచ్చిన చోట పరీక్షలు చేయించుకుంటామని ప్రసాద్ తెలుపడంతో ఆగ్రహానికి గురైన రాజ్‌కుమార్ ప్రసాద్‌పై దాడి చేశాడు. దీంతో ప్రసాద్ నారాయణఖేడ్ పోలీసులకు, వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డాక్టర్ రాజ్‌కుమార్ సైతం ప్రసాద్ తన విధులకు ఆటంకం కలిగించాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా కో ఆర్డినేటర్ సంగారెడ్డి శనివారం ఏరియా ఆస్పత్రిలో సిబ్బందితో, బాధితులతో వేర్వేరుగా మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు, కమిషనర్‌కు సమర్పిస్తామని సంగారెడ్డి తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించని పరిశ్రమకు తాళం

జిన్నారం, మార్చి 30: బొల్లారం మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లించని పరిశ్రమ గేటుకు అధికారులు తాళం వేశారు. శనివారం మున్సిపల్ ఆర్వో శ్రీధర్, బిల్లు కలెక్టర్లు పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానికంగా ఉన్న సుజన స్టీల్ పరిశ్రమ రూ.18లక్షల పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో గేటుకు తాళం వేసినట్లు ఆర్వో తెలిపారు. కాగా మున్సిపాలిటీలో మూతపడిన పరిశ్రమల నుంచి సుమారు రూ.1.50 కోట్ల పన్ను బకాయిలు రావాల్సి ఉన్నాయని ఆయన తెలిపారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, మార్చి 30: కాజీపల్లి పరిధి లోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన పలు కలకట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శనివారం ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో 181 సర్వే నెంబరు నెంబరులో నిర్మించిన పలు గదులు, బేస్మెంట్లను కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి, నిర్మాణాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ తెలిపారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

సంగారెడ్డి రూరల్, మార్చి 30: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికొదిలేసిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని రాయల్ జూనియర్ కళాశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ 6వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 7,200 కోట్ల పైచిలుకు స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యారంగాన్ని విస్మరిస్తే పోరాటాలు ఉధృతం చేసి ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

గడీల ప్రభుత్వాన్ని బద్దలు కొట్టిన ఘనత రేవంత్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

కౌడిపల్లి, మార్చి 30: గడీల ప్రభుత్వాన్ని బద్దలు కొట్టిన ఘనత రేవంత్‌దే అని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. శనివారం తునికి నల్లపోచమ్మ ఆలయాన్ని నీలం మధు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. మెదక్ పార్లమెంటరీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, రవిందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రావు, నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర హెల్త్ డైరెక్టర్

నర్సాపూర్, మార్చి 30: మండలంలోని రెడ్డిపల్లి పీహెచ్‌సీని శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ సందర్శించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయనిర్మలతో కలిసి పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బంది పని తీరుపై ఆరాతీశారు.

చాకరిమెట్ల హుండీ లెక్కింపు

శివ్వంపేట, మార్చి 30: శివ్వంపేట మండలం చాకరిమెట్ల ఆంజనేయస్వామి మూడు నెలల ఆదాయం రూ.3,27,358 సమకూరినట్లు దేవాదాయశాఖ అధికారి గంగారావు తెలిపారు. శనివారం హుండీ కానుకలను లెక్కించామని చెప్పారు.

ఓటింగ్‌పై అవగాహన

మనోహరాబాద్, మార్చి 30: పరిశ్రమ కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ ఐలా పారిశ్రామికవాడ పరిశ్రమ అధికారులతో సమావేశం నిర్వహించారు. మే లో జరిగే ఎన్నికల్లో పరిశ్రమల్లో పని చేసే ప్రతి ఒక్కరూ ఓటును హక్కును వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కృష్ణమూర్తి, జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, ఐలా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం

వెల్దుర్తి, మార్చి 30: గ్రామాల్లో ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసి మెలసి ఉండాలని ఆర్ఐ జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హస్తాల్‌పూర్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని హెడ్‌కానిస్టేబుల్ లయక్‌అలీతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంటరానితనాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రాజు, బాబు, కుమార్, మధు, శేఖమ్మ, ఇందు బాయి తదితరులు పాల్గొన్నారు.

● మనోహరాబాద్: మండల కేంద్రంలోని కూచారం గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఏఎస్ఐ నరసింహమూర్తి, ఆర్ఐ దీక్షిత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.


వార్షిక సమావేశానికి రైతులు అధికంగా హాజరుకావాలి

వెల్దుర్తి, మార్చి 30: ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో నిర్వహించే వార్షిక సభకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సహకార సంఘంలో వార్షిక మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో సిద్దయ్య 2023-24 జమ, ఖర్చుల పట్టిక, పాలకవర్గ సమావేశాల తీర్మానాలు, 2024-25 సంవత్సరపు అంచనా బడ్జెట్ వివరాలను సభ్యులకు చదివి వినిపించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొండాపూర్, మార్చి 30: కొండాపూర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల సహాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం సమర్పించినవారిలో నాయ కులు వెంకయ్య, సంజీవులు, కిషన్ తదితరులు ఉన్నారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే



భవానీమాత సన్నిధిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 30: మొగుడంపల్లి మండలంలోని భవానమ్మ పల్లెలోని భవానీ మాత ఆలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ శుక్రవారం రాత్రి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బాల్య వివాహాల నిషేధచట్టంపై అవగాహన



గడిపెద్దాపూర్‌లో నిర్వహించిన సదస్సులో ఎస్ఐ ప్రవీణ్, సఖీ కేంద్రం, మై చాయిస్ ఫౌండేషన్ అధికారులు

అల్లాదుర్గం, మార్చి 30 : చిన్న వయస్సులో (మైనర్) వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, బాల్య వివాహాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సఖీ కేంద్రం నిర్వహణ అధికారి రేణుక, కళావతి, అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో రెండు రోజులుగా సఖీ కేంద్రం, మై చాయిస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై, మహిళలకు కల్పించిన పలు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. రెండో రోజైన శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం సఖీ కేంద్రం సహకారాన్ని అందిస్తుందని సఖీ కేంద్రం నిర్వహణ అధికారి రేణుక, కళావతి స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాములు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడేందుకే నీటి విడుదల: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో సగరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కల్హేర్, మార్చి 30: నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టు కింద బీబీపేట్, ఫత్తేపూర్ గ్రామాల పరిధిలో ఎండుతున్న జొన్న, వరి పంటలకు కాపాడేందుకే సాగు నీరు విడుదల చేయించినట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పంటలు ఎండిపోతున్నాయని రెండు గ్రామాల రైతులు తన దృష్టికి తీసుకురాగా, వారికి ఇచ్చిన మాట ప్రకారమే శుక్రవారం నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా పంటలకు సాగునీటిని విడుదల చేయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. తాను ఎమ్మెల్యే అయ్యాక నిలిచిపోయిన పనుల స్థితిగతులను నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాలువల మరమ్మతు పనులు ప్రారంభింపజేశామని తెలిపారు. కాలువల పనులు జరుగుతున్నా, తాత్కాలికంగా పనులు నిలిపివేయించి పంటలు ఎండకుండా సాగు నీరు విడుదల చేయించినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల్లోనే తమ పంటలకు సాగు నీరు విడుదల చేయించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సగరుల సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణఖేడ్, మార్చి 30: సగరుల సమస్యలపరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన సగరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ కుటుంబానికి సగరులతో చక్కటి అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సగరుల సంఘంరాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో సగరుల కోసం ఒక భవనాన్ని నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే ఇందుకు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నర్వ అంజయ్య, తాలుకా అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, శరత్‌సాగర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, తదితరులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఖాయం: బీబీపాటిల్



అల్లాదుర్గం: మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కంచరి మమతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీబీ పాటిల్

పెద్దశంకరంపేట, మార్చి 30: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ దీమా వ్యక్తం చేశారు. పెద్దశంకరంపేట మండల అధ్యక్షులు కోణం విఠల్ ఆధ్వర్యంలో చీలపల్లి, మూసాపేట, జమ్మికుంట గ్రామాల్లోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన వందమంది యువకులు, గ్రామస్థులు బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, మరోసారి బీజేపీని గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మారుతిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, పత్రిరామకృష్ణ, మాజీ సర్పంచులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **అల్లాదుర్గం:** అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద శనివారం నూతనంగా బీజేపీ కార్యాలయాన్ని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కంచరి మమతా బ్రహ్మం తన అనుచరులతో బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనంతరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

● **రేగోడు:** స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశంలో బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గం వెనుకబడి ఉందని ఈ ప్రాంతానికి రైలు, రోడ్లు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, రాష్ట్ర నాయకులు బీడెకన్నె హనుమంతు, అనంత కులకర్ణి, ప్రభాకర్ గౌడ్, చంద్రశేఖర్, వీరప్ప, సతీష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సంగమేష్, బీజేవైఎం అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. బీబీ పాటిల్ సమక్షంలో రేగోడు, కొండాపూర్, పోచారం, సింధోల్, వట్‌పల్లి మండలం పోతులబోగుడ గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు.

ఘనంగా బొంతపల్లి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



చిలప్‌చెడ్: జగ్గంపేట హనుమాన్ మందిరంలో పూజలు

గుమ్మడిదల, మార్చి 30: మండలంలోని బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాతం, అభిషేకాలతో వేద పండితులు స్వామివారి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం దేవాలయ శాఖ ఈవో శశిధర గుప్తా ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.అనంతరం రంగపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణా భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తునికిలో ఎడ్ల బండ్ల ప్రదర్శన

కౌడిపల్లి, మార్చి 30: తునికి నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఘనంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఉదయం అమ్మవారిని పురోహితులు గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

జగ్గంపేటలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చిలప్‌చెడ్, మార్చి 30: మండలంలోని జగ్గంపేట గ్రామంలో హనుమాన్ మందిరంలో శివ పంచాయతన, నాగదేవతా, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం నుంచి సోమవారం వరకు మూడురోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్టు గ్రామ హనుమాన్ భక్త మండలి సభ్యులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. గ్రామంలో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి సూచనల మేరకు నూతనంగా శివపంచాయతన విగ్రహాలు, నాగదేవతలతో పాటు నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్నట్టు తెలిపారు.

చిన్నశంకరంపేటలో వరసిద్ధి వినాయక మహోత్సవాలు

చిన్నశంకరంపేట, మార్చి 30: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని వరసిద్ధి వినాయక ఆలయ 8వ వార్షికోత్సవ మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని గణపతి పూజ, చండీ హోమం, కుంకుమార్చన తదితర పూజలను నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

యాదగిరి నృసింహుడిని దర్శించుకున్న మదన్‌రెడ్డి

నర్సాపూర్,మార్చి 30: నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న మదన్‌రెడ్డి ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడానికి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మరుసటి రోజే యాదగిరిగుట్ట స్వామిని దర్శించుకోవడం విశేషం.

ఎన్నికల శిక్షణ షెడ్యూల్‌ను సవరించాలి

● కలెక్టరేట్ ఏవోను కోరిన టీపీటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఒక పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ ఒకే రోజు ఎన్నికల శిక్షణ ఇచ్చే షెడ్యూలును సవరించాలని టీపీటీఎఫ్ నాయకులు శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంను కోరారు. ఒకే రోజు శిక్షణతో పాఠశాల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల్లో సగం మందికి ఒక రోజు, మిగతా సగం మందికి మరుసటి రోజు శిక్షణ ఇవ్వాలని కోరారు. ఏవోను కలిసిన వారిలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్యయాదవ్, సోమశేఖర్, ఆనందం ఉన్నారు.

'టెట్ ఆన్‌లైన్ ఫీజు తగ్గించాలి'

నారాయణఖేడ్, మార్చి 30: టెట్ ఆన్‌లైన్ ఫీజు తగ్గించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి టెంకటి కుమార్ పేర్కొన్నారు. శనివారం ఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజును పెంచడం నిరుద్యోగులకు భారంగా పరిణమించిందన్నారు. గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.400 ఫీజు ఉండేదన్నారు. ప్రస్తుతం ఒక పేపర్‌కు రూ. వేయి, రెండు పేపర్లకు రూ.2వేలుగా పెంచడం వల్ల భారం పెరిగిందని వాపోయారు. సమావేశంలో సంఘంనాయకులు పవన్, రాహుల్, రాకేష్, అమర్, బన్నీ పాల్గొన్నారు.

రుణాల రికవరీపై దృష్టి సారించాలి

హత్నూర, మార్చి 30: మండలంలోని ఆయా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో రికవరీ అయ్యేలా చూడాలని డీఆర్డీవో జ్యోతి ఐకేపీ సిబ్బందికి సూచించారు. శనివారం హత్నూర మండల సమైక్య భవనంలో ఐకేపీ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, శ్రీనిధి, రుణాలు తీసుకున్న సంఘాల మహిళలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటిసారిగా హత్నూర మండల సమైక్య సమావేశానికి హాజరైన డీఆర్డీవో జ్యోతిని ఐకేపీ సిబ్బంది శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంలు దేవేందర్, శ్రీదేవి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అధ్యక్షుడికి సన్మానం




విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 30 : సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎనిమిదోసారి ఎన్నికైన ఎ.విష్ణువర్ధన్‌రెడ్డిని శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కె.జగన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కోర్టులోని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, తెలంగాణ అంబేడ్కర్ సేవా సమితి జిల్లా కార్యదర్శి సురేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్యాట్ పరీక్షలో బుదేరా డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

మునిపల్లి, మార్చి 30: మండలంలోని బుదేరా చౌరస్తాలోని మహిళా డిగ్రీ కళాశాల నుంచి ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీలలో 2024 సంవత్సరానికిగాను క్యాట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి పీజీ ప్రవేశాలకు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐఎం కాశీపూర్ యూనివర్సిటీల్లో ఎంబీఏ కోర్సులకు బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు రేచల్ జ్యోతి, జి. విధిత, యు.అఖిల, ఆర్. జ్ఞానేశ్వరి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసిన్ ఆరా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కిష్టాపూర్‌లో గంగమ్మకు బోనాలు



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి.

కొల్చారం, మార్చి 30: మండల పరిధిలోని కిష్టాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మంజీరా నది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల కాశీనాథ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్, జడ్పీటీసీ మేఘమాల, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు

● కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

హవేళిఘణపూర్, మార్చి 30: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు పండుతాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఫరీద్‌పూర్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి ఖర్చులేకుండా సహజసిద్ధంగా వరితో పాటు కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర పంటలు పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుకు అవసరమైన పంట యాజమాన్య పద్ధతులు, ఎరువులు వినియోగం గూర్చి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో నాగమాధురి, కేవీకే హెడ్ దత్తాత్రేయ, ఏఈవో భార్గవ్, సీఈవో అమీర్, రైతులు ఉన్నారు.